206) సాళంగనాట/అఠాణ

ప॥ ఏమని తలచవచ్చు నిటువంటి నీచిత్తము । దీమసాన నీభావము తెలియ దెవ్వరికి ॥

చ॥ రవిచంద్రగ్రహతారకములకు దెరువు । వివరించ నున్నదా నీవే యాధారముగాక ।
పవనునికి భువికి పదునాలులోకముల- । కవల వేరొకచోట నాధార మున్నదా ॥

చ॥ తిలకింప గులాచలదిగ్గజశేషాదులకు । నిలువ జోటున్నదా నివే యాధారముగాక ।
నలుదిక్కులకు గగనమునకు మేఘాలకు । కలది నీయాధారమే కాక వేర వున్నదా ॥

చ॥ అనంతబ్రహ్మాండముల కట్టే నీరూపములకు । వెనకముందున్నదా నీవే యాధారముగాక ।
వినుతి కెక్కినశ్రీవేంకటేశ నీకు నీవే । మనికైనయాధారము మఱి యెంచ నున్నదా ॥